# కవిరాయడు : మహారాజు

ఒకనాటి ప్రాతఃకాలాన కవిరాయడు స్వప్నావస్థనుంచి మేలుకొన్నాడు. బాహ్యప్రపంచవైఖరి అతనికి గోచరించింది. నిజస్థితి అతడిమనస్సుకు తట్టింది. ఖిన్నుడై పోయినాడు! మహారాజుకు తనమీద దయ తప్పిపోయిం దని గ్రహించినాడు!

* * *

కవిరాయడు కవికుటుంబాన పుట్టినాడు, కవిగర్భాన జన్మించినాడు. అతను పుట్టినప్పుడు కోకిలలు కూసినవి, చిలకలు పలికినవి, మోడుచెట్లు చిగిరించినవి! లోక మంతా కవిరాయణ్ణి చూసి స్వాగత మన్నది.

ఆసమయాన కవిరాయడి తండ్రి తన హృదయాన్ని పరిశీలించి చూసుకొన్నాడు. కవిత్వానికి బదులు ఆనందరసం హృదయాన నిండి వుండడం గమనించినాడు. తన సంతానాన్ని ఆనందబాష్పాలలో ఒక్కమారు తలచుకొని "మహారాజుకు కృతిగా సమర్పించగల నాకడసారి ప్రబంధం వీడే గదా" అనుకొన్నాడు. తన చిన్ని ప్రబంధాన్ని మహారాజుచేతిలో బెట్టి నిద్రావస్థ చెందినాడు.

* * *

మహారాజు రాజ్యభారంతో మునిగి తేలుతున్నాడు. ఏది మంచి, ఏది చెడ్డ అనేవిషయాలు నిర్ణయించుకొనడంలో కాలం జరిగిపోతున్నది. ఆయన ప్రజలను శాసిస్తున్నాడు, పన్నులు రాబట్టుకొంటున్నాడు, మహర్షుల ముఖాలవెంట ఉపదేశవాక్యాలు వింటున్నాడు. రాజ్యపాలనం కష్టమైనపని అనుకొంటున్నాడు. అప్పుడప్పుడు మహారాజు చెవులల్లో కవులగీతాలు పడుతూ వుండడం కలదు. అవి ఈర్ష్యాగీతాలో, ప్రణయగీతాలో ఆమహారాజు ఎలా నిర్ణయించుకోగలడు? కవిరాయడితండ్రి సమర్పించిన కుమారప్రబంధాన్ని మహారాజు ఎక్కడో పెట్టి మరిచిపోయినాడు.

* * *

కవిరాయడు చిన్ననాటి చెలికాళ్ళతో దృఢమైత్రి చేసుకొని ప్రపంచాన్ని మరిచిపోయినాడు. చిలకలతో జట్టు కట్టి తియ్యటిపలుకులు నేర్చుకొన్నాడు. కోయిలలతో సంచారం చేసి పలుకులకు పంచమ స్వరం అలవరుచుకొన్నాడు. గోదావరి నాశ్రయించి స్వేచ్ఛాగాన మభ్యసించినాడు.

అతనినివాసం ఎల్లప్పుడూ కొండలమీదా చెట్లమీదా. అతనిదృష్టి యెల్లప్పుడూ ఆకాశపథాన నక్ష

త్రమండలం వైపే. ఈసహవాసబలంచేత కొంతకాలం పాట పాడడమే మరిచిపోయినాడు కవిరాయడు.

సహవాసుల ప్రోద్బలంచేత కొంతకాలానికి మళ్ళీ గీతాలు పాడడం మొదలుపెట్టినాడు కవిరాయడు. ప్రకృతిగీతాలు, ప్రణయగీతాలు! చిలకలు కోకిలలు అతనిగీతాలు మెచ్చుకొన్నవి. ఇంతవరకూ లోకులు రంగుబొమ్మలను చూసి మెచ్చుకొనేవారు; సజీవమైన గీతాలను చూసి మూకీభావం వహించారు.

కవిరాయడి వంశంవా రంతా మహారాజుకు కృతు లిచ్చిన వారే. కవిరాయడు మాత్రం తనతొలిచూలి బిడ్డను చిలకలకూ కోయిలలకూ సమర్పించినాడు.

మంచి సావాసం చేయడం లేదని మహారాజు కవి రాయణ్ణి మరిచినా డన్నారు కొందరు; చిలకలకూ కోయిలలకూ కృతి యివ్వడం యుక్తం కాదని ఆగ్ర హించి వుండవచ్చునని మరికొంద రన్నారు. నిజమైన సంగతి మాత్రం ఎవ్వరికీ తెలియ లేదు.

* * *

మహారాజుకు తనమీద దయ తప్పిం దని తెలుసు కొని ఖిన్నుడై కవిరాయడు విషాదగీతాలు పాడ నారంభించినాడు. లోకాన్ని ఆవరించి వున్నదుఃఖ సముద్రంలో అవన్నీ లీన మై పోయినవి!

కొంతకాలానికి తెలివి తెచ్చుకొని మహారాజుపైన గీతా లల్లినాడు కవిరాయడు. మహారాజుకు అందజేస్తానని చెప్పి వాయువు ఆగీతాలను తనగర్భంలో దాచుకొన్నది. మళ్ళీ కొత్తగీతాలు పాడినాడు కవిరాయడు. మహారాజుకు అందజేస్తామని చెప్పి చిలకలు ఆగీతాలు తమలో లీనం చేసుకొన్నవి. కొత్తకృతులు మళ్ళీ పాడినాడు కవిరాయడు. ఈమారు మహారాజుకు అందజేస్తామని చెప్పి కోయిలలు ఆకృతులను పుచ్చుకొని ఎక్కడికో లేచిపోయినవి!

చిన్ననాటి చెలికాళ్ళు తనపైన కోపించినట్లు కవిరాయడు గ్రహించినాడు. చిన్ననాటి సావాసగాండ్రను పూర్తిగా మరచినాడు. తనదృష్టి మహారాజు మీదికి మరల్చి ఎంతో విశ్వాసంతో ఆయనను హృదయపీఠాన నిలుపుకొన్నాడు. "ధనదేవతను ఉపాసిస్తున్నావా!" అని చిలకలు కవిరాయణ్ణి గేలి చేసినవి. "మేము లేని గీతాలు గీతాలా!" అని కోయిలలు పరిహాసం చేసినవి. "వంశమర్యాద కాపాడుకో వలెసుమా!" అని స్వప్నంలో కవిరాయడి తండ్రి ఆదేశించినాడు. కవిరాయడిదృష్టి ఎంతమాత్రం చెదరలేదు. ఒకటే లక్ష్యం—మహారాజు!

కవిరాయడికి యౌవనం వచ్చింది. మహారాజుకు
దయ కలగలేదు!

* * *

కొంతకాలం ధ్యానముద్రలో వుండి తర్వాత మహా
రాజుపైన మళ్ళీ గీతాలు ప్రారంభించినాడు కవిరా
యడు. సొంతంగా మహారాజుకు వాటిని కృతి ఇయ్య
దలుచుకొన్నాడు.

కవిరాయడికి మహారాజు దర్శనం లభించలేదు.
తనవంశీయుల పూర్వకృతులలో కలిపి గొంతెత్తి తన
కృతులను పాడ మొదలుపెట్టినాడు కవిరాయడు. కా
ర్య భారంలో వుండడం చేత గీతాలు మహారాజు చె
వులలో పడలేదు.

నానాటికి గీతాలసంఖ్య హెచ్చి పోతున్నది. నిరం
తరమూ పాటలు పాడడంచేత కవిరాయడి గొంతు
బొంగురు పోతున్నది.

కార్య నిమగ్నుడై వున్నాడు మహారాజు. నిరాశ
ఎక్కువవుతున్నకొద్దీ మహారాజు మీద విశ్వాసం
అధికం కాజొచ్చింది కవిరాయడికి. ప్రచారార్థం తన
గీతాలన్నింటినీ లోకం మీద విడిచి పెట్టినాడు
కవిరాయడు.

గీతాలు పఠించారు లోకులు. "మహారాజు వ్యా

దయం వజ్రశకల!" మన్నారు కొందరు. "ప్రకృతిని వదిలిపెట్టినతర్వాత స్తోత్రపాఠాలలోకి దిగినాడు. గీతాలు పాడడం లే"దన్నారు కొందరు. "సత్కార్యానికి ఫలం ఆశించడం యుక్తం కా"దన్నారు వకకొందరు. "వంశమర్యాద మీరడం ఎంరితర" మన్నారు మరి కొందరు.

కవిరాయడికి లోకంమీద కోపం పుట్టింది. మనస్సులో ఒకానొకమూర్తిని ప్రతిష్ఠించుకొని తాను రచించిన కృతు లన్నింటినీ ఆమూర్తికి సమర్పించడం మొదలు పెట్టినాడు. ఆమూర్తే మహారాజన్నాడు కవిరాయడు.

ఎంతో కాలం గడిచింది. మహారాజుతల నెరిసింది. ఒళ్ళు ముడతలు పడ్డవి. రాజ్యభారం నానాటికి అతిశయిస్తున్నది.

కవిరాయడికి దృష్టి మందగించింది, చేతులకు వణుకు పుట్టింది. కంఠం రుద్ధ మవుతున్నది. గీతాలు పాడుతూనే వున్నాడు.

కవిరాయడిమీద అనుగ్రహం కలగలేదు మహారాజుకు; మహారాజుమీద విశ్వాసం తగ్గ లేదు కవిరాయడికి!

౧౯-౨౪